గవర్నర్‌కు కలెక్టర్ స్వాగతం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 39వ, 40వ వార్షిక స్నాతకోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని జీబీసీ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. భవనాలు తొలగించిన నేపథ్యంలో తాత్కాలిక విద్యుత్ ఏర్పాటుకు మంగళవారం మున్సిపల్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో యుద్ధప్రాతిపదికపై విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో పూర్తిస్థాయి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని అధికారులు వెల్లడించారు.

పాఠశాల తనిఖీ చేసిన ఎంఈఓ

విశాలాంధ్ర-పొన్నూరు : దోప్పలపూడి జడ్పీ పాఠశాలను మంగళవారం మండల ఎంఈఓ-2 శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మధ్యాహ్నం భోజనంతోపాటు పాఠశాల రికార్డులు, డైరీలు, హాజరు రికార్డులు తదితరాలు తనిఖీ చేశారు. ఈ ఏడాది పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాసనాభివృద్ధి పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్

విశాలాంధ్ర-మంగళగిరి : రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న కార్డ్ 2.0 దస్తావేజు లేఖర్లకు జీవసమాధి లాంటిదని, వారి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని మంగళగిరి దస్తావేజు లేఖర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మంగళగిరిలో దస్తావేజు లేఖర్ల సమావేశం నిర్వహించారు. కార్డ్ 2.0 అమలు నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 30, 31 తేదీలలో రాష్ట్ర సంఘం పిలుపుమేరకు దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్‌కు పిలుపునిచ్చారు. కార్డ్ 2.0 అమలు జరిగితే దస్తావేజు లేఖరి పని కానీ, లేఖరి సంతకము కానీ, స్టాంపు పని కాని ఉండదన్నారు. సెప్టెంబర్‌లోగా మొత్తం రాష్ట్రంలో కార్డ్ 2.0 అమలులోకి వస్తుందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెలియచేశారని, ఇందుకు నిరసనగా మంగళగిరి దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్‌కు కక్షిదారులు, ప్రజలు సహకరించాలని దస్తావేజు లేఖర్లు కుక్కమళ్ళ జయరాజు, మండదపు బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కిషోర్ కోరారు.

సరికొత్త టొయోటా రూమియన్ బుకింగ్స్ ప్రారంభం

గుంటూరు: టయోటా కిర్లోస్కర్ మోటర్, అధికారికంగా బుకింగ్‌ల ప్రారంభాన్ని, దాని తాజా ఆఫర్ పూర్తి సరికొత్త టొయోటా రూమియన్ ధరలను ప్రకటించింది. దీనిని ఆగస్ట్ నెల ప్రారంభంలో విడుదల చేశారు, ఇది వినియోగదారుల నడుమ పూర్తి ఉత్సాహాన్ని కలిగిస్తుంది. ఆరు గ్రేడ్‌లలో అందుబాటులో ఉన్న ఈ అసాధారణమైన కొత్త కాంపాక్ట్ బి-ఎంపీవీ దాని సాటిలేని స్థలం, సౌకర్యం, అద్భుతమైన ఇంధన సామర్థ్యం, ఆకర్షణీయమైన, ప్రీమియం బాహ్య డిజైన్‌తో కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుందని భావిస్తున్నారు. టీకేఎం యొక్క తాజా ఆఫర్ ఆకర్షణీయమైన ఎక్స్-షోరూమ్ ధరలలో రూ. 10,29,000 నుండి రూ. 13,68,000లో లభిస్తుంది.

పరిశీలన తర్వాతనే ఓటు తొలగింపు చేపట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఫారం-7, వ్యక్తిగత ఆధారాలు, సూపర్వైజరి అధికారులు నేరుగా పరిశీలన చేసిన తర్వాతనే ఓటు తొలగింపు చేపట్టాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ పొన్నూరు రోడ్, అలీ నగర్, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో జరిగిన డోర్ టు డోర్ ఓటర్ సర్వేని అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, సూపర్వైజరి అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించి, స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడారు. చనిపోయిన ఓటర్ల తొలగింపు, షిఫ్టెడ్ ఓట్లు, ద్వంద ఓట్లు తొలగింపు, నూతన ఓటర్ల నమోదు వివరాలను బిఎల్‌ఓలు క్షేత్రస్థాయి పరిశీలించి, అర్జీలు తీసుకున్న తర్వాత సూపర్వైజరి అధికారులు నేరుగా తనిఖీ చేసి సిఫార్స్ చేయాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ (ఏఈఆర్ఓ) ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

కపర్ది శతజయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-తాడికొండ : గుంటూరు నగరంలోని సీపీఐ కార్యాలయంలో సెప్టెంబర్ 3న ఏఐటీయూసీ వ్యవస్థాపకులలో ఒకరైన మండలపర్తి వెంకటనారాయణ కపర్ది శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. జన సమీకరణ కార్యక్రమంలో భాగంగా పొన్నెకల్లు, తాడికొండలో పర్యటించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ జి.హరిగోపాల్, ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి విచ్చేయున్నట్లు తెలిపారు. జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గం కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు షేక్ నాగుల్ మీరా, రైతు సంఘ నాయకులు చింతల భాస్కరరావు, యర్ర నరసింహరావు నాయక్ పాల్గొన్నారు.

మహాశక్తితో వైసీపీ ఓటమి ఖాయం



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మహాశక్తితో వైసీపీ ఓటమి ఖాయం అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం స్థానిక 22వ డివిజన్ లోని 60అడుగుల రోడ్డులో పశ్చిమ నియోజకవర్గ టీడీపీ మహిళా నేతలు, నాయకులతో కలసి మహాశక్తి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా మహాశక్తి పథకం లోని అంశాలను కోవెలమూడి రవీంద్ర మహిళలకు క్లుప్తంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలంతా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో మోసాలను గ్రహించి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు పలకాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు నాగూర్ వలి, క్లస్టర్ ఇంచార్జి రామారావు, మహిళా అధ్యక్షురాలు దాసరి జ్యోతి, వెంకటసాయి, కరీం, మౌళిక తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మరమ్మతు పనుల కారణంగా పశ్చిమ నియోజకవర్గంలో గురువారం సాయంత్రం నుండి శనివారం ఉదయం వరకు త్రాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం నుండి సరఫరా యధావిధిగా జరుగుతుందన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త గిడుగు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తన ఉద్యమం ద్వారా తెలుగు భాషను సామాన్యుల దగ్గరకు చేర్చి, వ్యవహారిక భాషను మాధ్యమంగా తీర్చిదిద్దిన గొప్ప సంఘ సంస్కర్త గిడుగు వెంకట రామ్మూర్తి పంతులని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కొనియాడారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు 160వ జయంతిని పురస్కరించుకుని కలక్టరేట్‌లోని వీసీ హాల్‌లో వారి చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు భాష సరళమైనదని, తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్యం ఫరిడవిల్లే విధంగా జిల్లాలో ఆగష్టు 23 నుండి 29 వరకు తెలుగు భాషా వికాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. వ్యవహారిక తెలుగు భాషా పితామహుడైన గిడుగు రామ్మూర్తి భాషాభిమానాన్ని అందరూ కలసికట్టుగా ముందుకు తీసుకెళ్ళేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ చంద్రశేఖర రావు, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, జిల్లా టూరిజం అధికారి నాయుడమ్మ , కలక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్‌లు ఉండటానికి వీల్లేదు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో ఎక్కడా అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్‌లు ఉండటానికి వీలు లేదని, వార్డ్ సచివాలయం వారిగా అడ్మిన్ కార్యదర్శి, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు పూర్తి భాధ్యత వహించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారిగా అడ్మిన్ కార్యదర్శులు తమ పరిధిలో ఏ ఒక్క నిర్మాణంకు పన్ను లేకుండా లేదా ఉండాల్సిన దానికన్నా తక్కువ ఉందా అని పరిశీలించి ఆర్.ఐ. ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. నూతన అపార్ట్మెంట్‌లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసిన నెల రోజుల్లో ఆస్తి పన్ను విధించాలని స్పష్టం చేశారు. ఆసీలు వసూళ్ల పై సమీక్షించి, గత ఏడాదితో పోలిస్తే డిపార్ట్మెంట్ వసూళ్లు చేసినా ఈ ఏడాది తక్కువ వసూళ్లు జరగడం గమనించి, రెవెన్యూ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆసీలు టెండర్ పొంది, బకాయిలు చెల్లించని వారి నుండి వసూళ్లకు చట్టపరంగా యాక్షన్ ప్లాన్‌ని డిప్యూటీ కమిషనర్లు సిద్ధం చేయాలన్నారు. అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్లుగా మార్చాలని పేర్నినానికి వినతి

విశాలాంధ్ర-తాడేపల్లి : పార్ట్ టైం లెక్చరర్స్‌ను జూనియర్ లెక్చరర్లుగా పరిగణలోకి తీసుకోవాలని కోరు తూ మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి పేర్ని నాని(వెంకటేశ్వర రావు)కి ఏపీ ఎయిడెడ్ కాలేజీస్ టెంపరరి, పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరిగ జోషి రావు, పలువురు లెక్చరర్స్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరిగ జోషిరావు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ఎయిడెడ్ కళాశాలల్లోని క్లియర్ ఎగనెస్ట్ ఎయిడెడ్ పోస్టులలో 900 మంది పనిచేస్తున్నామని అయితే మేనేజ్‌మెంట్ వారు తమకు ఇచ్చే జీతాలు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. పని విషయంలో రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పాఠాలు చెప్పడం, ఎగ్జామినేషన్ డ్యూటీలు వేస్తూ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ వారి అపాయింట్‌మెంట్ ఆర్డర్ వాల్యుయేషన్ కూడా వారితో సమానంగా చేస్తున్నామని, కానీ వాళ్ళు లక్షల్లో జీతాలు పొందుతున్నారు. మేము మాత్రం చాలీచాలని జీతాలతో సరిపెట్టుకుంటున్నామని అన్నారు. 1998 డీఎస్సీలో క్వాలిఫై అయిన ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇచ్చారో అలాగే మా కుటుంబాలకు కూడా తమరు తగు న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. స్పందించిన పేర్ని నాని సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

చిట్టి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిరసన

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు హిందూ దేవాలయాల్లో అన్య మతస్తుల, నేరస్తుల నియామకాన్ని నిరసిస్తూ తెనాలి చిట్టిఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిరసన తెలియపరుస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి ప్రజారంజకంగా పాలించడం చేతకాలేదు, దేవాలయాలను నిర్వీర్యంగా మార్చే కుట్రలు చేస్తున్నారని, వెంటనే ఈ చర్యలు మానుకోవాలని అన్యమతస్తులను టిటిడి కమిటీలో నుంచి వెంటనే తొలగించాలని ఆధ్యాత్మిక రాజధాని తిరుమల రాజకీయ పునరావాస కేంద్రంగా చేయడం నిలిపివేయాలని లేదంటే బీజేపీ ఆధ్వ ర్యంలో ప్రజా ఉద్యమం చేపడాతమని వైకాపా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మంచాల రత్నరాజు, తమరిశ అనంతాచార్యులు, అన్నవరపు వేణు, మైలా హరికృష్ణ, శిఖా రవీంద్ర, వివిధ హిందూసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకాకాని : అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పెదకాకాని సీపీఐ కార్యాలయంలో మంగళవారం కరపత్రాలు విడుదల చేశార. పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టీన్ పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.250 కోట్లు కార్పస్ పండుగ విడుదల చేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా ఆరు మాసాలు అంటే ఆరు మాసాలలో అగ్రిగోల్డ్ కస్టమర్‌లందరికీ న్యాయం చేస్తానని చెప్పి రూ.10 వేలు కట్టిన వారికి, రూ.20 వేలు కట్టిన వారికి మాత్రమే మూడు సంవత్సరాలలో కొందరికి మాత్రమే చెల్లింపులు చెల్లించి మిగతా వారిని గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులు సుమారు 20 లక్షల మంది మన రాష్ట్రంలోనే ఉన్నారని, వారికి న్యాయం చేయనిపక్షంలో 20 లక్షల కుటుంబాల ఓట్లు ఎవరైతే హామీ ఇస్తారో వారికే వేసే అవకాశం ఉందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం వచ్చే నెల 15వ తేదీన విజయవాడలో ఉదయం 10 గంటలకు కళాక్షేత్రం నుంచి ప్రదర్శన ప్రారంభమై జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగ సభ జరుగుతుందని, అగ్రిగోల్డ్ బాధితులందరూ విజయవాడ కళాక్షేత్రం వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకొని బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సొలస వెంకటేశ్వరరావు, బొట్టు శ్రీనివాసరావు, వడ్లమూడి రవి, పమిడిమల్ల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరో రోజుకు గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-తెనాలి : కొలకలూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సాయిబాబా గుడి వద్ద నుండి 6వ రోజు తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలుగా అందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ఈ పథకాల ద్వారా ప్రజలు లబ్ధిపొందారని వివరించారు. జరగబోయే ఎన్నికల్లో కూడా జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించి ప్రజలు జగనన్న సేవలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చెన్నుబోయిన శ్రీనివాసరావు, కోడూరి స్వప్న, రమేష్, దోసపాటి నాగదేవి, చక్కా సీతమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందమూరి హరికృష్ణకు నివాళి

విశాలాంధ్ర-తాడేపల్లి : నందమూరి హరికృష్ణ 5వ వర్ధంతి సందర్భంగా మంగళ వారం తాడేపల్లి టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దారా దాసు, అద్దంకి మురళి, బెజ్జం రామకృష్ణారావు, మండవ గోపాలరావు, ఇట్టా భాస్కర్, అక్కల చెన్నయ్య, గొర్ల వేణుగోపాల్ రెడ్డి, షేక్ సైదా హుస్సేన్, అడపా నరేష్, దర్శి హరికృష్ణ, పోతాబత్తిన శ్రీను, చిలకూరి చెన్నారావు, రాజు, నవీన్, కోగంటి వెంకటేశ్వరరావు, కోగంటి ప్రసాదు పాల్గొన్నారు.

అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో: టీడీపీ తాడేపల్లి మండల కార్యాలయంలో టీడీపీ మండలాధ్యక్షులు అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లి శేషు, అరవపల్లి శ్రీనివాస్, బొర్రా వందన, దొప్పలపూడి జ్యోతిబసు, పఠాన్ ఖాసీం ఖాన్, కళ్ళం రాజశేఖరరెడ్డి, కాట్రగడ్డ మధుసూదనరావు, అక్కినేని సుబ్రహ్మణ్యం, శొంఠి సత్యనారాయణ, కె.కోటేశ్వరరావు, షేక్ నాగుల్, ఇప్పటం శంకరశెట్టి, పిచ్చియ్య, కంచర్ల రంగారావు, శ్రీనివాసరావు, దాసరి కృష్ణ, షేక్ నాగూర్ వలి, వల్లభపురం శంకర్, కూనప్ప రెడ్డి రమేష్, కొలంటి మహేష్, కొలంటి మాణిక్యలరావు, కాపూరి రవీంద్రనాథ్, బల్ల నాగరాజు, ప్రాతూరు రాజేష్, చొక్కా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : తెలుగు ప్రజల గుండెల్లో చైతన్య రథసారధిగా అందరి వాడుగా నందమూరి హరికృష్ణ నిలిచిపోతారని మండల పార్టీ అధ్యక్షులు తోట పార్థసారథి అన్నారు. మంగళవారం మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతిని టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నిర్వహించారు. హరికృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి వీర వెంకట సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, కొమ్మా సుకుమార్, ఊట్ల శ్రీమన్నారాయణ, అబ్దుల్ మజీద్, వేమూరి మైనర్ బాబు, చింకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో దివంగత నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ముత్తినేని రాజేష్, ఈరంటి వరప్రసాద్, ఉప్పుటూరి పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు త్వరితగతిన చేపట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు : వెల్ఫేర్ సెంటర్‌లో వాకింగ్ ట్రాక్ పనులను త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలోని కాకుమానువారితోటలో ఉన్న కార్మిక శాఖకు చెందిన వెల్ఫేర్ సెంటర్‌లో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్‌రావు, ఏఈ అనూషలు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను కలిసి అక్కడి పరిస్థితులను వివరించారు. కొన్నేళ్ల కిందట ఈ స్థలంలో 6.58 ఎకరాలు గుంటూరు సమగ్ర ఆసుపత్రికి కేటాయించి అక్కడ ఈఎస్‌టీ ఆసుపత్రి, అత్యవసర విభాగాలు నిర్మించాలని నిర్ణయించారని చెప్పారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారని, కానీ పనులు ప్రారంభించడంలో అలసత్వం సమంజసం కాదన్నారు. తక్షణమే కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళి ట్రాక్ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చూడాలని కోరారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర-మంగళగిరి : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, ప్రపంచ మానవ హక్కుల సమితి, బీసీ సంక్షేమ సంఘం మంగళగిరి, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి సీకే జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు రకాల క్రీడలు నిర్వహించి బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో విజయా హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ సీఈవో, ప్రపంచ మానవ హక్కుల సమితి రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ అన్నం నాగబాబు, జంజనం రామాంజనేయులు, వుడత శ్రీనివాస్, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, దామర్ల నారాయణ, మాదు నాగదుర్గ, మాదు వెంకటేశ్వరరావు, కర్ర సాము గురువు కావటి వెంకట్, తైక్వాండో గురువు దుర్గాప్రసాద్, జూనియర్ కళాశాల పీటీ రవి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దళిత బహుజన యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ)రాష్ట్ర కార్యదర్శి అల్లడి దేవకుమార్ అన్నారు. డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో 'యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు-సవాళ్లు'అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రంగంలో కేవలం 2శాతం మందికే ఉపాధి అవకాశాలు లభ్యమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునే విధంగా శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. జిల్లా సహాయ ఉపాధి కల్పనాధికారి కె.రమాదేవి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకుల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఆయా జిల్లాల్లో ప్రాంతాల వారీగా జాబ్‌మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి వీసీహెచ్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన కళాశాలలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీంతో వివిధ రకాల కోర్సులు చదివే విద్యార్థులతో పాటు నిరుద్యోగులు ఈ కోర్సులను నేర్చుకుని ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూ కళాశాల అధ్యాపకులు డాక్టర్ చుక్క నవీన్‌కుమార్, వ్యాపారవేత్త రాజేష్ పిళ్ళా, డీబీఆర్‌సీ ప్రతినిధులు నాగలక్ష్మీ, కస్తూరి, శశిధర్, ధనరాజ్ తదితరులు ఉన్నారు.

పోరాట యోధుడు యార్లగడ్డ

విశాలాంధ్ర-మంగళగిరి: అమరజీవి కామ్రేడ్ యార్లగడ్డ సుబ్బారావు 25వ వర్ధంతి సభను చినకాకాని సీపీఐ కార్యాలయంలో మంగళవారం యార్లగడ్డ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం చినకాకాని గ్రామ సీపీఐ నాయకులు తోట వీరనారాయణ, కటారి జోజి యార్లగడ్డ సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఉత్తమ కమ్యూనిస్టు యోధుడు, బడుగు బడుగు బలహీన వర్గాల ముద్దుబిడ్డగా పేరొందిన యార్లగడ్డ సుబ్బారావు సామాన్య పేద రైతు కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులై సాధారణ కార్యకర్తగా పనిచేసి మంగళగిరి ఏరియా సీపీఐ నాయకునిగా, కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎదిగారని అన్నారు. మంగళగిరిలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలిప్పించడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. సీపీఐ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్య దర్శి అన్నవరపు ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శ పత్తేవరపు వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతానికి, పేదల సంక్షేమం కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమించి అసువులు బాసిన సుబ్బారావు వారి హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ సభలో మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, గుంటక సాంబి రెడ్డి, సీపీఐ చిన్నకాకాని కార్యదర్శి కటారి జేసుదాసు, ఆర్దల వెంకట్రామయ్య, మాజీ సర్పంచ్ కుక్కమళ్ళ నాగేశ్వరరావు, పంతగాని మరియదాసు, బుర్ల శ్రీనివాసరావు, ముద్రబోయిన శీను, గండికోట శ్రీనివాసరావు, పాదిలి, గౌరీ నేని సాంబయ్య, కుక్కమళ్ళ ధనుంజయరావు, కుక్కమళ్ళ రాంబాబు, ఇంటూరి గోపిరాజు, పాదిలి మరియ దాసు, పత్తిపాటి బాలస్వామి, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఆళ్ళమూడి హనోక్ బాబు, చినకాకాని గ్రామ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

తెలుగు వ్యవహారిక భాషకు పట్టం కట్టిన 'గిడుగు'

విశాలాంధ్ర-గుంటూరు : శతాబ్ద కాలం క్రితం తెలుగు భాషను వ్యవహారిక చేసిన ఘనాపాటి గిడుగు వెంకట రామమూర్తి సేవలు తెలుగు భాష ఉన్నంతకాలం వెలుగుతుందని 'తానా' ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కీర్తిశేషులు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని ఘనంగా జరిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశాల్లోనైనా మాతృభాషలోనే విద్యా బోధన జరుగుతుందన్నది అక్షర సత్యం అన్నారు. నేడు దేశం, ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు వివిధ రంగాల ప్రముఖులు తెలుగు భాషలోనే చదువుకున్నారన్న సంగతి మరువకూడదన్నారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక ద్వారా ప్రవాస తెలుగువారికి అమెరికాలో తెలుగు పాఠశాలలు నెలకొల్పి తెలుగులో మన సంస్కృతి, సాంప్రదాయాలు, కళల పరిరక్షణకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు ప్రసంగించారు. జిల్లాస్థాయి అంతర్ కళాశాలల పోటీలలో వ్యాసరచన మొదటి బహుమతి, కథా రచనలో రెండవ బహుమతి, వక్తృత్వం పోటీల్లో రెండవ బహుమతి, పద్య పఠనంలో మొదటి బహుమతి సాధించిన విద్యార్థినులను సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శైలజ సభకు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో కవి అబ్దుల్ రజా హుస్సేన్, డాక్టర్ వాసిరెడ్డి భవాని, డాక్టర్ ఎం.విజయలక్ష్మి, డాక్టర్ ధాత్రి కుమారి, డాక్టర్ దివిజాదేవి, డాక్టర్ పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ భాష గౌరవించడం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అమ్మను పూజించడం అమ్మ భాషను గౌరవించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని జైన్ హైస్కూల్ డైరెక్టర్ మొహమ్మద్ మున్ను అన్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు జైన్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఆధునిక తెలుగు వ్యవహార భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని జైన్ హై స్కూల్లో తెలుగు భాషలో వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మున్ను మాట్లాడుతూ మాతృభాష అనేది ఎవరు నేర్పించకుండానే అమ్మ కడుపులో ఉన్న నాటి నుండే అలవాటు అవుతుందని అన్నారు. అన్ని భాషల కంటే తెలుగు భాష ఎంతో మాధుర్యంగా ఉంటుందని, ఇది ఎంతో సుసంపన్నమైన భాషా అని అన్నారు. విద్యార్థులు మాతృభాషపై ఆసక్తి కలిగి ఉండాలని, సంస్కృతి సంప్రదాయాలను మనమందరం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సుమేధ'లో తెలుగు భాషా, క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలోని సుమేధ హైస్కూల్ నందు వ్యవహారిక భాషా ఉద్యమ కర్త గిడుగు రామమూర్తి, హాకి క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు గిడుగు రామమూర్తి ఎనలేని కృషి చేశారుని, ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తుగా ఆయన జయంతినే మాతృ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో భాగ్యమని తెలిపారు. హాకి క్రీడలో విశేష ప్రతిభ చాటిన మేజర్ ధ్యాన్ చంద్ హాకి క్రీడా ప్రపంచానికే ధృవతారగా నిలిచారని కొనియా డారు. ఈ సందర్భంగా సుమేధ స్కూల్ విద్యార్థులు కూడా జాతీయ అంతర్జాతీయ క్రీడలలో పాల్గొని దేశానికి మంచి పేరు తేవాలని ఆశించారు. ముఖ్యఅతిథిగా లీడ్ ప్రోగ్రాం ఏపీ సీనియర్ అకడమిక్ అడ్వైజర్ బీవీ సుధాకర్ పాల్గొని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందించారు.

శ్రీచైతన్యలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా స్థానిక బుర్రి పాలెంలోని శ్రీ చైతన్య పాఠ శాల నందు తెలుగు భాషా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఏజీఎం నూతలపాటి అంజయ్య, ఆర్ఐ అప్పాజీలు గిడుగు వేంకట రామ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ లక్ష్మీపతి మాట్లాడుతూ తెలుగు భాషను గ్రాంధిక భాష నుంచి వ్యవహారిక భాషగా రూపాంతరం చెందటానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలుత విద్యార్థులు రకరకాల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ గోపీచంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాష రక్షించుకుందాం: క్రాంతి కృష్ణ

విశాలాంధ్ర-తెనాలి : తెలుగు భాషను పరిరక్షించుకునేందుకు తెలుగు వారమందరం ప్రతిన బూనుదాం అని గిడుగు ముదిమనుమరాలు క్రాంతి కృష్ణ చరవాణి ద్వారా సందేశమిచ్చారు. గాంధీనగర్‌లో బొల్లిముంత శివరామ కృష్ణ ఫౌండేషన్ హాల్లో ఇస్కఫ్ (ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్) తెనాలి ఆధ్వర్యంలో మంగళవారం గిడుగు రామమూర్తి జయంతి సభ జరిగింది. రచయిత రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించారు. క్రాంతి కృష్ణ సందేశమిస్తూ దేశవిదేశాలలో కూడా తెలుగు భాషను ప్రోత్సహించాల్సిన అవసరం వుందన్నారు. తెలుగుభాషా దినోత్సవంగా గిడుగు రామమూర్తి జన్మదినాన్ని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఆయన జీవితాంతం సాహిత్యం కోసం ఎనలేని సేవలు అందించారు. వ్యవహారిక భాష విజయంలో కీలకమైన పాత్ర పోషించారని చెప్పారు. తెలుగు సాహిత్యాన్ని గ్రాంధీక భాష గడప దాటించి జనానికి ఆమోదకరమైన వ్యవహారిక భాషగా మలచటంలో ఆయన పాత్ర అమోఘమైనదన్నారు. ఉద్యమాన్ని ప్రారంభించింది గిడుగు రామమూర్తి తరువాత గురజాడ కందుకూరి అని చెప్పారు. సవరల జాతి భాష కులిపిని అందించారన్నారు. కార్యక్రమాన్ని ఇస్కఫ్ నాయకులు బొల్లిముంత కృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రచయిత బి.లలితనంద ప్రసాద్, ఆళ్ళ నాగేశ్వరరావు, చందు నాగేశ్వరరావు, చందు సూర్య, రవి, వెంకయ్య, పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా స్థాయి ఆటల పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు : ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆరు విభాగాలలో డిస్టిక్ లెవెల్ ఆటల పోటీలు గుంటూరు బాయ్స్ హైస్కూల్‌లో మంగళవారం వైభవంగా జరిగాయి. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లాలోని 18 మండలాల నుంచి 350 మంది విద్యార్థులు, ప్రత్యేక అవసరాలు విద్యార్థులకు సపోర్టుగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గుంటూరు మండలాల విద్యాశాఖ అధికారులు, గుంటూరు ఈస్ట్-1 వెంకటేశ్వరరావు, జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గెలిచిన విద్యార్థులకు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష విజయలక్ష్మి చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

పభుత్వ భూములు పేదలకు ఎందుకు పంచలేదు: ఎమ్మెల్యే బొల్లా

విశాలాంధ్ర-వినుకొండ: పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన జీవీ ఆంజనేయులు వినుకొండ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించి పేదలకు ఎందుకు పంచలేకపోయాడని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘాటుగా విమర్శించారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జాలలపాలెం వద్ద 175 ఎకరాల ప్రభుత్వ భూమి కొన్ని రోజులు నేను కబ్జా చేసాను అంటాడు మరికొన్ని రోజులు మూల్పూరి ఆగ్రోటెక్ వారిది అంటాడు. జీవీ ఆంజనేయులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని అక్కడ ఉన్న 175 ఎకరాలు ఎవరి ఆధీనంలో ఉందో పరిశీలించుకొని ప్రభుత్వానికి స్వాధీనం చేయవచ్చు కదా అని ఎమ్మెల్యే బొల్లా ప్రశ్నించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో ప్రభుత్వ భూమిని 180 ఎకరాలు జీవి బావమరిది పేరుతో బదలాయించి అమ్ముకోలేదా అని బొల్లా ప్రశ్నించారు. జాలపాలెంలో 175 ఎకరాల భూమిపై కోర్టుకు వెళ్లిన వ్యక్తికి ప్రమాదం ఉందని జీవి మాట్లాడుతున్నాడని, జీవినే అతన్ని ఏమన్నా చేసి నాపై నెట్టాలని చూస్తున్నాడని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అన్నారు. హత్యలు చేయించిన సంస్కృతి ఎవరిదో ప్రజలకు తెలుసునని ఎమ్మెల్యే అన్నారు.

సంచారజాతుల సభ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఈ నెల 31వ తేదీన రాజమహేంద్రవరంలో జరగనున్న భారతదేశ విముక్తి సంచారజాతులు మహాసభను విజయవంతం చేయాలని సంచార జాతుల సంఘం కార్యదర్శి అన్నపురెడ్డి వీరరాఘవులు కోరారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ సభ ముఖ్య ఉద్దేశం ఎస్సీ, ఎస్టీ, బీసీ జాబితాలో ఉన్న సంచార విముక్తి జాతులకు ఆయా జాబితాలకు వచ్చే రిజర్వేషన్ ఫలాలు ఈ సామాజిక వర్గాలకు అందటం లేదు కాబట్టి 2008 బాలకృష్ణ రేణుకే కమీషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం సంచార జాతులను రాజ్యాంగంలో చేరుస్తూ 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని, మన రాష్ట్రంలో ఉన్న పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు సమావేశాల్లో ప్రస్తావించి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ఎంపీలను కోరతామని అన్నారు.

అజాతశత్రువు వెంకటరెడ్డి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన మండల వైసీపీ నాయకులు వజ్రాలు వెంకట్ రెడ్డి అజాతశత్రువు అని ఎమ్మెల్యే శంకర్రావు అన్నారు. మంగళవారం పెద్దకర్మ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ వైసీపీని గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి చేసేందుకు వెంకటరెడ్డి పాత్ర మరు వలేమని అన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈద సాంబిరెడ్డి మాట్లా డుతూ అన్ని వర్గాల ప్రజలను ఆప్యాయతగా పలకరిస్తూ అజాతశత్రువుగా ఎదిగిన వెంకటరెడ్డి మృతి బాధాకరమని అన్నారు. హనుమంతరావు, భవి రిశేటీ హనుమంతరావు, కె.శ్రీనివాస్ రెడ్డి, సిరా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల వైసీపీ కన్వీనర్ మస్తాన్ షరీఫ్, కంకణాల శివాజీ, భయంకర శుభాని, వజ్రాల వెంకట్ రెడ్డి, జయరామిరెడ్డి, ఎంపీటీసీ అల్లం భవాని, రాయవరపు సత్యనారాయణ రెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

4న తహశీల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : గత ప్రభుత్వం అసంపూర్తిగా నిలిపివేసిన తహశీల్దార్ కార్యాలయ భవనం మంత్రి అంబటి రాంబాబు చొరవతో నిర్మాణం పూర్తి చేసుకుంది. సెప్టెంబర్ 4వ తేదీన ఉదయం 10 గంటలకు మంత్రి అంబటి రూ.1.2 కోట్ల నిధులతో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయం, నైపుణ్య శిక్షణభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.17.5 లక్షల నిధులను అంబటి చొరవ తీసుకొని మంజూరు చేయించారు. త్వరలో ప్రహరీ గోడ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని నాయకులను, అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పట్టణ, రూరల్ మండలం వైసీపీ కన్వీనర్లు రాయపాటి పురుషోత్తమరావు, సహారా మౌలాలి, పక్కాలా సూరిబాబు, పల్నాడు జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, తహశీల్దార్ సురేష్ నాయక్, కమిషనర్ కొలిమి షమ్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు జయంతి

విశాలాంధ్ర-అమరావతి : శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. ప్రపంచ భాషలలో తెలుగు భాష ఎంతో గొప్పదని, మనమందరం తెలుగు వారీగా పుట్టడం ఎంతో అదృష్టమని వక్తలు కొనియాడారు. మన వ్యవహారిక భాషలోనే అచ్చు పుస్తకాలు ముద్రణకు రామ్మూర్తి కృషి అనిర్వచనీయమైనదని శనగవరపు రామ్మోహన్ శర్మ అన్నారు. తెలుగును ఎప్పుడు మర్చిపోరాదని తెలుగును విడిచి పెట్టకూడదని సాహిత్య పరిశోధకులు వావిలాల సుబ్బారావు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వేమూరి గోపి విశ్వనాథ శర్మ, పాఠశాల సమితి అధ్యక్షులు పులిపాటి వెంకట పవన్ కుమార్, కార్యదర్శి వాకా వెంకటేశ్వర్లు, వారణాసి వెంకటేశ్వర శర్మ, కౌశిక ప్రసాద్, గోళ్లమూడి సుధీర్ శర్మ, చెన్న నరసింహారావు, శనగవరపు రామ్మోహన్ శర్మ, ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, గాజుల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డి పాదయాత్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులకు చేరుకున్న సందర్భంగా మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన చేపట్టబోయే పాదయాత్రను విజయవంతం చేయాలని మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ అన్నారు. మంగళవారం వీరాస్వామి మాట్లాడుతూ బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు మాచర్ల మండలం కొత్తపల్లి జంక్షన్ నుంచి భైరవునిపాడు వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. పాదయాత్రలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, చెల్లూరి అప్పలరాజు, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, నూకరాజు, ఆడెపు కోటయ్య, అప్పలరాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మాయమైన ఇసుక... తిరిగి ప్రత్యక్షం

విశాలాంధ్ర-గురజాల : వైసీపీ నాయకులు అధికారులకు ఇసుక సినిమా చూపించారు. నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. ప్రభుత్వం నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా కాలనీ సమీపంలో భారీగా ఇసుక నిల్వ చేశారు. ఇది అదునుగా చేసుకొని కొంతమంది అధికార పార్టీ నాయకులు తమ వ్యక్తిగత అవసరాల కోసం, అడ్డదారిలో ఇసుకను విక్రయించి సొమ్ము చేసుకునేందుకు సుమారు నాలుగు టిప్పర్ల ఇసుకను జేసీబీల సహాయంతో తరలించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించేందుకు వెళ్లిన నగర పంచాయతీ కమిషనర్ ఇసుక చోరీకి గురైందని గమనించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి సీసీ కెమెరాలు పరిశీలించగా అధికార పార్టీ నాయకుడు సహాయంతో సుమారు నాలుగు టిప్పర్ల ఇసుక చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన ఇసుక గత రాత్రి జగనన్న కాలనీలో తిరిగి ప్రత్యక్షమైంది. ఇది చర్చనీయాంశంగా మారింది.

సాహిత్యం, కళలు సమాజాన్ని సంస్కరించాలి

పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : సాహిత్యం, కళలు సమాజాన్ని సంస్కరించి, ప్రజా పోరాటాలను ప్రతిబింబించాలని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని సీపీఐ కార్యాలయంలో అరసం, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం ఇటీవల అరసం జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందన సభ, గిడుగు రామూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గిడుగు రామూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి అరసం, ప్రజా నాట్యమండలి ఎంతో కృషి చేస్తున్నాయని తెలిపారు. సమాజంలోని దురాచరాలను రూపుమాపటంలో, ప్రజలను చైతన్యవంతులని చేయడంలో అభ్యుదయ రచయితల సంఘం నిర్మాణాత్మక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. తెలుగు భాషను ప్రజల భాషగా మార్చటంలో గిడుగు రామమూర్తి ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడని, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, శ్రీశ్రీ ఆయన భావజాలాన్ని వ్యాప్తి చేశారని తెలిపారు. తెలుగు భాషను నిత్య నూతన జీవ భాషగా నిలిచి ఉంటుందని, ఇందుకు సాహిత్యకారులు, కళాకారులు కృషి చేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ దాదాపు 45 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘంలో వివిధ హోదాల్లో పనిచేశారని, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని తెలిపారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెనుగొండ వారి గ్రంథంను ఆధారంగా చేసుకొనే తాను పరిశోధన చేసి డాక్టరేట్ సాధించానని గుర్తు చేసుకున్నారు. ఆయన అందించిన సహకారం మరవలేనిదని, తెలుగు భాషకు పెనుగొండ చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని చెప్పారు. తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ శ్రామిక పక్షపాతి అన్నారు. తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో రచనలు కొనసాగించారని, జాతీయ స్థాయిలో అభ్యుదయ రచయితల సంఘంకు తెలుగు వ్యక్తి అధ్యక్షుడిగా ఎంపిక కావడం తొలిసారి అని, ఇది ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పెనుగొండతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అభ్యుదయ రచయిత సంఘంను విస్తృతం చేయాలని, కవులు, రచయితలు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ సందర్భంగా గాయకులు బెల్లంకొండ భారతి, బొంతా భగత్ సింగ్ ఆలపించిన గీతాలు అలరించాయి. అనంతరం పెనుగొండ లక్ష్మీనారాయణను పలువురు కవులు, రచయితలు, కళాకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, రావిపాటి వెంకటేశ్వరరావు(ఆర్వీ), పేలూరి రామారావు, నాయుడు శివకుమార్, పీవీ రమణ కుమార్, గోరంట్ల నారాయణ, శరత్‌చంద్ర, దార్ల బుజ్జిబాబు, ఆరాధ్యుల రామకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగే.. దొంగ దొంగ అన్న చందాన ఎమ్మెల్యే తీరు: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వ భూములను అప్పనంగా మింగేస్తున్న తిమింగలం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. మంగళవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మనాయుడు తీరు దొందే దొంగ.. దొంగ.. అన్న చందంగా ఉందన్నారు. బ్రాహ్మణపల్లి రెవిన్యూ జాలలపాలెం గ్రామం వద్ద 175 ఎకరాల అడవి, కుంట, చెరువు, ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించి అనుభవిస్తూ బ్రహ్మనాయుడు తన వద్ద సెంటు కూడా ప్రభుత్వ భూమి లేదని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ముల్పూరి ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వద్దనుండి మొత్తంగా భూములు కొనడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బొల్లా మూల్పూరి ఆగ్రో టెక్నాకు బినామీ అని విమర్శించారు. 175 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యక్రాంతంపై లోకాయుక్త, హైకోర్టులో ప్రజా వైద్యం వేయటం, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించడంతో 175 ఎకరాల ప్రభుత్వ భూమి, దానిలో ఉన్న కోట్ల విలువచేసే ఎర్రచందనం తనకు దక్కకుండా పోతుందని అక్కసుతో ఎమ్మెల్యే ప్రతిపక్షంపై విషం చిమ్ముతున్నాడని ఎద్దేవా చేశారు. ఆర్ ఎస్ ఆర్ దాకల ప్రభుత్వ భూములు ఉన్నట్లుగా లోకాయుక్తకు వినుకొండ తాసిల్దార్ 175 ఎకరాల ప్రభుత్వ భూమి సమగ్ర వివరాలను సమర్పించడం జరిగిందన్నారు. ఉన్న వాస్తవాలను వెలుగుతీస్తూ అఖిలపక్ష పార్టీలు చేస్తున్న ఆందోళనతో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అవినీతి, భూ కబ్జాల దోపిడి బయటకు వస్తుందని నట బ్రహ్మగా ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గ్రావెల్ గజదొంగ బ్రహ్మనాయుడు అని, వేల ట్రక్కుల గ్రావెల్ మట్టి తన ఆవుల ఫారానికి అక్రమంగా తోలుకొని రౌడీయిజం చేస్తున్నారని విమర్శించారు. మార్కాపురం రోడ్డు నేషనల్ హైవే పక్కనే ఎమ్మెల్యే కొనుగోలు చేసిన 100 ఎకరాల్లో 62ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని ఆరోపించారు. చివరకు శ్రీ రామలింగేశ్వర స్వామి గుడి పేరుతో కూడా దోచుకుంటున్నాడని, బొల్లా బ్రహ్మనాయుడు దోపిడీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అయుబ్ ఖాన్, సీనియర్ నాయకులు పి.వి సురేష్ బాబు పాల్గొన్నారు.

అమ్మవారికి అభరణాలు బహూకరణ

విశాలాంధ్ర-మాచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామం పోలేరమ్మ చౌడేశ్వరి అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పోలేరమ్మ అమ్మవారికి న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు జున్నా శ్రీనివాసరెడ్డి పద్మావతి దంపతులు లక్ష రూపాయల విలువైన వెండి కిరీటం, వెండి వడ్రాణం బహుపదించారు. ఈ సందర్భంగా జున్నా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిమగల పోలేరమ్మ తల్లి అమ్మవారికి ప్రతి సంవత్సరం గ్రామస్తులు వార్షికోత్సవం పేరిట ఉత్సవాన్ని నిర్వహించటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ఇరువంటి సత్యనారాయణ శాస్త్రి, కె గిరి శర్మ, గ్రామ సర్పంచ్ ఓరుగంటి జయరామిరెడ్డి, ఆరికట్ల పున్నారెడ్డి, గాలి బాలిరెడ్డి, దగ్గుల లచ్చిరెడ్డి, ఓరుగంటి జయరామిరెడ్డి, పోతిరెడ్డి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లి వెంకట్రామి రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మాచర్ల: వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ముందుగా బర్తడే కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యావంతుడైన సోదరుడు వెంకటరామిరెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేవాడని, రాజకీయ రంగంలో అభివృద్ధి చెందుతూ, రాష్ట్ర వ్యాప్తంగా తనకంటూ గుర్తింపును సాధించుకోవడం సంతోషకరమన్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకొంటూ భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో కాయలు, రొట్టెలు పంపిణీ చేసి, శ్రీశైలం రోడ్డులోని లెప్రసీ కాలనీలో పలువురికి అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ చైర్మన్లు బోయ రఘురామిరెడ్డి, తురకా కిషోర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ తాడి వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస శర్మ, షేక్ అజీజ్, సాయి మార్కొండా రెడ్డి, ఎరబోతుల శ్రీనివాసరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, గట్ల కోటిరెడ్డి, బాలస్వామి రెడ్డి, పోలా శ్రీను, షేక్ సుభాని, షేక్ అబ్దుల్ జలీల్, మేకపోతు రామాంజిరెడ్డి, రాచూరి వలి, రాచూరి జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాళ్లలో వైసీపీ-టీడీపీ మధ్య ఘర్షణ

విశాలాంధ్ర-వెల్దుర్తి : మండల పరిధిలోని గొట్టిపాళ్ళ గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే గ్రామంలో గత నాలుగు రోజులుగా జాతర సందర్భంగా నైవేద్య సమర్పణ జరుగుతుంది. ఈరోజు జరిగిన నైవేద్య సమర్పణలో భాగంగా ఊరేగింపుగా వెళుతూ రంగులు చల్లుకుంటున్న సమయాన ఎదుటి వర్గీయుల ఇళ్ల ముందు కుంకుమ పడడంతో ఘర్షణ మొదలైంది. ఈ ఘటనలో వైసీపీ వర్గీయులైన పొన్నాల వెంకటేశ్వర్లు, రాజనబోయిన రవీంద్ర బాబు, సూదినబోయిన అనిల్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. అలాగే టీడీపీ వర్గీయులు రాజబోయిన బాబు, రాజబోయిన శివరాజులకు గాయాలయ్యాయి. గాయాల పాలైన క్షతగాత్రులను బంధువులు మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గ్రామంలో ఎటువంటి అలజడులు రేగకుండా పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక చోరిపై చర్యలేవి

విశాలాంధ్ర-గురజాల: నగర పంచాయతీలోని 18వ వార్డ్‌లో జగనన్న లేఅవుట్‌లో 4టిప్పర్ల ఇసుకను వైసీపీ నేత దొంగిలిస్తే, దొంగిలిచిన వ్యక్తిపై ఎందుకు ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని జనసేన జిల్లా కార్యదర్శి కటికం అంకారావు అన్నారు. వైసీపీ నేతలు శాసనసభ్యులు మహేష్ రెడ్డితో మాట్లాడుకొని ఇసుక రికవరీ చేసుకొంటే సమస్య పరిష్కారం అయినట్టేనా అని ఆయన ప్రశ్నించారు. దొంగిలించిన ఏవస్తువునా రికవరీ అయితే ఎఫ్ఐఆర్ ఉండదా అని ఆయన ఏద్దేవా చేశారు. 18వ వార్డ్ లోని సుంకరగుంటలో జగనన్న లే అవుట్ బేసుమట్టం కొరకు కాంట్రాక్టర్లు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. సంబంధిత విషయమై మున్సిపల్ కమిషనర్ ని వివరణ కోరగా కాంట్రాక్టర్లకు కలెక్టర్ పర్మిషన్ ఇచ్చారని చెప్పటం, పర్మిషన్ లెటర్ చూపించమని అడిగితే మా దగ్గర లేదు కాంట్రాక్టర్ల దగ్గరే ఉందని కమిషనర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. ప్రజాధనాన్ని కాంట్రాక్టర్ల జేబులు నింపుకోవడానికి కలెక్టర్ ఆదేశాలు ఇస్తారా అని, రెండు మూడు రోజులలో కలెక్టర్‌ని కలిసి వివరణ అడుగుతామని ఆయన తెలియజేసారు. అక్రమంగా తరలించే మట్టి డబ్బులను నగర పంచాయతీ డెవలప్మెంట్ కొరకు వినియోగించాలని కోరారు.

విశ్వకర్మ యోజన పథకంపై సమీక్ష

విశాలాంధ్ర-నరసరావుపేట: 'సంప్రదాయ హస్త కళా నైపుణ్యాల పెంపునకు, చేతి వృత్తుల వారిని ఆదుకునేందుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఈ పథకాన్ని జిల్లాలో ఉన్న చేతవృత్తుల వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం పథకం అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద తొలి ఏడాది 18 సంప్రదాయ చేతి వృత్తుల వారికి ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం క్రింద ఎవరైతే పూర్వ వృత్తులు చేస్తూ జిల్లాలో ఉన్నారో వారిని గుర్తించేందుకు వారికి పూర్తి అవగాహన కల్పించేందుకు అవగాహనా కార్యక్రమం ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయమని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పనకు చర్యలు

విశాలాంధ్ర-ఈపూరు : కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)ల ద్వారా పాడిరైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వైసీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఈపూరు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఈపూరు, వనికుంట గ్రామాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో పాడి రైతులకు రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈపూరు పశు వైద్యాధికారి పయ్యావుల శ్రీనివాసమూర్తి హాజరై మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిపుష్టికి కృషి చేసేందుకు జగనన్న పాల వెల్లువ ఎంతో దోహదపడుతుందన్నారు. మహిళా పాడి రైతులకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు జగనన్న పాలవెల్లువ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మహిళ పాడి రైతుల ప్రయోజనం కోసం చేపట్టిన అమూల్ డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రామాల్లో పాడి రైతులకు మేలు చేసే అమూల్ డైరీని బలోపేతం చేసేందుకు జగనన్న పాలవెల్లువ దోహదపడుతుందన్నారు. ఈ పథకంలో భాగంగా ఎలాంటి ష్యూరిటీలు లేకుండా మహిళ పాడి రైతులకు రూ.30 వేల వర్కింగ్ క్యాపిటల్ అందిస్తామన్నారు. ఎలాంటి ష్యూరిటీలు లేకుండా పాలు పోసే రైతులకు గుంటూరు జిల్లా సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా పాడి పశువులు కొనుగోలుకు రూ.1.6 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పశువైద్యశాల సిబ్బంది, ఆయా శాఖల అధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి సేవలు ఎనలేనివి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావు పేట: సరళ గ్రాంధిక భాషా అభివృద్ధికి ఉద్యమాలు చేసిన వ్యక్తి, వ్యావ హారిక భాషకై అవిరళ కృషి చేసిన వ్యక్తి గిడుగు వెంకట రామ మూర్తి అని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. నరసరావుపేటలోని భువన చంద్ర టౌన్ హాలులో ఆయన 160వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సలను జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నెలా మూడవ శనివారం వెన్నెల కార్యక్రమం నిర్వహించి తెలుగు భాషా నేపధ్యం, భూమిక తెలుసుకొనే విధంగా ఒక్కో వారం ఒక్కోక కవిపై కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతున్నదని అన్నారు. శాలివా హన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, ఎమ్మెల్సీ లక్ష్మణ రావు మాట్లా డుతూ తెలుగు బాషలో పోటీ పరీక్షలలో పాల్గొన్న వారికీ వెయిటేజ్ ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. అనంతరం ఈ నెల 24న విద్యార్థులకు, అధికారులకు నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటి మూడు వరుసలలో నిలిచిన వారికి మోమెంటో ప్రసంశా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి స్యామ్యూల్, సంఘీక సంక్షేమ శాకాదికారి ఓబుల నాయుడు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు తెలుగు బాషకు సంబంధించిన ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. క్రీడా పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందచేశారు.

భాషా సంస్కృతులను కాపాడుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : తమ భాషా సంస్కృతులను కాపాడుకుంటూ, తరువాత తరాలకు జాగ్రత్తగా అందించాల్సిన బాధ్యత మనపై ఉందని తోటకూర వెంకటనారాయణ అన్నారు. మాతృభాషా పరిరక్షణ దినోత్సవ సందర్భంగా స్థానిక భారతరత్న ఇందిరా గాంధీ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కాపు వెంకటరావు మాట్లాడుతూ ఇంగ్లీషు వంటి ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పు లేదని, కానీ మన మాతృభాష తెలుగును నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారావు, క్లబ్ కార్యదర్శి ఆళ్ళ వేమన రెడ్డి, సభ్యులు కొల్లా శివప్రసాద్, మాజీ అధ్యక్షులు తాళ్ల అంజిరెడ్డి, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో తెలుగు భాషా, జాతీయ క్రీడల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఆ క్లబ్ పూర్వపు అధ్యక్షులు అలంగార్ మోహన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రోటిరియన్ సింగారెడ్డి భాస్కరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తెలుగు భాషను రక్షించటానికి నేనేం చేస్తానంటే? అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేశారు. క్లబ్ సభ్యులు కేఎస్ఆర్ ప్రసాద రాజు, అలా దాసునాయన, డి.పుల్లయ్య, బాల సాహితీవేత్త దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి నాగుల్ మీరావలి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకూరపాడు : మానవత్వానికి మించిన మతం లేదని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మరోసారి నిరూపించారు. నియోజవకర్గంలో ప్రజల మేలు కోసం ఎన్నో పనులు చేసిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు సాయం అందించడంలో కూడా మానవత్వం చూపించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను నేరుగా వారి ఇళ్లకు వెళ్లి అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వచ్చిన ఆరుగురు లబ్దిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లారు. వారిని పరామర్శించి చెక్కులు అందజేశారు. అందిన సాయాన్ని నేరుగా ఇంటికి వచ్చి అందిం చిన ఎమ్మెల్యేకు లబ్దిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈద సాంబిరెడ్డి, వైసీపీ నాయకులు కలి శీను వాసరెడ్డి, బచ్చు హనుమంతరావు, వజ్రాల వెంకటరెడ్డి, కేశర గంగాధర్ రెడ్డి, చిరా శ్రీనువాసరెడ్డి, జి.శ్రీనువాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి ఓర్వకల్లు టీడీపీ కార్యకర్తలు

విశాలాంధ్ర-అచ్చంపేట : మండలంలో వైసీపీకి రోజు రోజుకీ ఆదరణ పెరుగుతోంది. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమం.. ఎంతోమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీలో చేరుతున్నారు. అచ్చంపేట మండలం ఓర్వకల్లులో టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు.. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైసీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం పేదలకు అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందిస్తుందన్నారు. గతంలో తాను ఏ ఇంటికి వెళ్లినా సమస్యలు చెప్పేవారన్నారు. కానీ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి సమస్యను తెలుసుకొని పరిష్కరించామన్నారు. అందుకే ఇప్పుడు ఏ గడపకు వెళ్లినా ఆదరణ, ఆప్యాయత లభిస్తోందన్నారు. ఓర్వకల్లు గ్రామాభివృద్ధికి అందరూ ఒకే కుటుంబంలా కలిసిపోయి కృషి చేయాలన్నారు. వైసీపీలో చేరిన వారిలో ఓర్వకల్లు గ్రామ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోట జోజయ్య, ముఖ్య నాయకులు కొలకలూరి రవి, రవితేజ, భాస్కర్, శివ, గంగాధర్, సురేష్, నాగేష్, మణియ్య, సత్యం బాబు, దావీదు, గణేష్, గురుస్వామి, ఏసుపాదం, నాగేశ్వరరావు, నరేంద్ర, మరియబాబు, యాకూబు, లచ్చయ్య, శేషు, సత్యం బాబు, ముగేషు, కోటయ్య, మరియబాబు తదితరులున్నారు.

ప్రజాసమస్యలపై పాలకపక్ష సభ్యుల ఆగ్రహం..

విశాలాంధ్ర-వినుకొండ: సచివాలయ వ్యవస్థ సరిగ్గా పనిచేయడం లేదు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అధికార పార్టీ సభ్యులే మున్సిపల్ అధికారులపై చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగింది. ఆర్ఐ మణికంఠ అజెండాలో రూపొందించిన 31 అంశాలను చదివి వినిపించగా కౌన్సిల్ ఆమోదించినట్లు చైర్మన్ ప్రకటించారు. ఇక అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లే తమ వార్డులోని పలు సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లు తమ మాట వినడం లేదని అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా వారి ఇష్టము వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారని వాపోయారు. 19వ వార్డ్ కౌన్సిలర్ ఎంఎస్‌కే బాష మాట్లాడుతూ పట్టణంలో శాశ్వత తాగునీటి పథకం పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించి నేటికీ పూర్తి కాలేదని ప్రశ్నించగా కమిషనర్ డి.వెంకయ్య మాట్లాడుతూ 2018లో శాశ్వత తాగునీటి పథకం మంజూరయ్యిందని, పనులు ప్రారంభించామని అయితే సదరు కాంట్రాక్టర్ మూడు ప్రాంతాల్లో కాంట్రాక్టు పనులు చేస్తూ ఇక్కడ చేసిన పనులకు బిల్లు చెల్లింపులు జాప్యం కారణంగా అతను వెళ్లిపోవటం జరిగిందని త్వరలో పూర్తి చేస్తామని ఆయన సమాధానం ఇచ్చారు. ఎప్పుడో దశాబ్దాలనాడు వేసిన పైపులైన్లు పగిలిపోయి అందులో మురుగునీరు ప్రవేశించి ప్రజలకు మురుగునీరు వెళుతుందని సభ్యులు భాష అధికారులపై మండిపడ్డారు. ఇక సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లు కేవలం పెన్షన్లు ఇవ్వడమే తప్ప మరొక సంక్షేమ పథకాలు సక్రమంగా పట్టించుకోవట్లేదు అన్నారు చేయూత పథకానికి సంబంధించిన ప్రింటెడ్ దరఖాస్తు ఫారాలు లేక తెల్ల కాగితాలపై రాసి ఇస్తున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. కమిషనర్ వెంకయ్య మాట్లాడుతూ. సచివాలయ వ్యవస్థపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ పి బ్రహ్మయ్య మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో శిథిలావస్థకు చెందిన భవనాన్ని తొలగించమని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకో లేదని ప్రశ్నించారు. దీంతో సానిటరీ అధికారి చెన్నకేశవులు మాట్లాడుతూ దోమల మందు 16 రోజులకు ఒకసారి స్ప్రే చేయాలని అయినప్పటికీ పది రోజులకు ఒకసారి స్ప్రే చేస్తున్నామన్నారు. 26వ వార్డు కౌన్సిలర్ గంట కాలే మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు వేళలు పాటించడం లేదని ప్రజల పట్ల కౌన్సిలర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని. అన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ గౌస్ బాషా మాట్లాడుతూ జగనన్న కాల నీలో ఇల్లు నిర్మాణాలకు పట్టాలు ఇచ్చారు కానీ కొందరి ఇల్లు నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు. ఏఈ శ్రీనివాసరావు. పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **RAVIPATI AJAYAKUMAR** S/o. **RAVIPATI VENKATESWARLU** (Old Name), R/o. D.No.1-44, Lingaraopalem Village, Solasa Road, Edlapadu Mandal, Palnadu District - 522234, Andhra Pradesh, have changed my name to **RAVIPATI AJAY KUMAR**. Hereafter my name is known as **RAVIPATI AJAY KUMAR.**

GENERAL NOTICE
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: NARASARAOPET
CREDITOR I.P. NO. 50 OF 2023

Between:-
Pentyala Gangadhar - Petitioner/Creditor
And
01, Pavuluri Murali Krishna
02, Gujjala Amarnadh Reddy
- Respondents

To
01, Pavuluri Murali Krishna S/o Balakoteswara Rao, R/o Govada, Amarthaluru Mandal, Tenali JCJC
02, Sri Gujjala Amarnadh Reddy S/o Venkateswara Reddy, Q. No. A-519, Church Bazar, Hills Colony Nellikal 508 202 Pedapura Mandal, Nalgonda District

In this matter the first respondent who is debtor to the petitioner sold the property in favour of the 2nd respondent vide registered sale deed No. 301/2023 of SRO., Vinukonda dated 06-01-2023 and the petitioner filed this creditor Petition stating that the said sale is not binding upon him and vest the property in Official Receiver for administration and the matter was posted to **06-09-2023** for appearance of the Respondent. In this matter any third parties having objection may appear before the Honourable Court on **6-09-2023 at 10-30 a.m.** either personally or thorugh an adocate and file your objections if any. Else the matter will determined in your absence.

B.M.S.DURGA PRASAD
Advocate for Petitioner
Sub-Collector Office Road
Kothapet, TENALI-522 201
Cell: 9440229459

Narasaraopet
Dt : 20-08-2023

రక్షక్ వన భోజనశాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర -బాపట్ల : జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ అవరణలో ఇటీవల ప్రారంభించబడిన రక్షక్ వన భోజనశాల నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన ఔత్సాహికులు ఈ నెల 31వ తేదీన సాయంత్రం 5:00 గంటల లోపు ఆర్.ఐ.(ఎ.ఆర్) (వెల్ఫేర్) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరిశీలన అనంతరం లాటరీ పద్ధతి ద్వారా రక్షక్ వన భోజనశాల నిర్వహణదారుడిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రక్షక్ వన భోజనశాల నిర్వాహకులు నెలకు రూ.10 వేలు అద్దె ప్రతి నెల 5వ తేదీ లోపు చెల్లించాలన్నారు. ఉదయం 06 గంటల నుండి సాయంత్రం 06 గంటల వరకు క్యాంటిన్‌ను తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి ఏడాది రూ.1000 అద్దె పెంచనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు నిర్ణయించిన ధరలకే క్యాంటిన్‌లో ఆహార పదార్థాలు విక్రయించాలన్నారు. వివరాల కొరకు 9121102226 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఓట్ల విషయంలో అభ్యంతరాలు తెలపాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : డోర్ టు డోర్ ఓటర్ వెరిఫికేషన్‌లో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సరోజిని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఓట్లు,తొలగించిన ఓట్లు,తీసేసిన ఓట్లు తదితరముల విషయమై చర్చించారు.ముఖ్యంగా తొలగించిన ఓట్లపై అందరికీ వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వాలన్నారు.తొలగించిన ఓట్ల విషయమై వ్యక్తిగతంగా పరిశీలన చేయాలన్నారు.తదుపరి సమావేశంలో వివరాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నుండి కౌతరపు జనార్ధన్ రావు, వైకాపా నుండి గుంటూరు మాధవరావు,కొండ్రు బాబ్జి,జనసేనపార్టీ నుండి గూడూరు శివరామప్రసాద్,రావూరి బాలాజీ, భాజపా నుండి శంకరశెట్టి నాగేశ్వరరావు,మేడికొండ భరణిరావు, సిపిఎం పార్టీ నుండి ఎన్.బాబురావు, జయ రావు, చీరాల తహశీల్దార్ ప్రభాకరరావు,వేటపాలెం తహశీల్దార్ అశోక వర్ధన్, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రను అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం కమ్యునిటీ హెల్త్ సెంటర్ నందు ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న పసుమర్తి బేబీ కల్పన ఆరోగ్యశ్రీ పథకం నందు ఉత్తమ సేవలు అందించినందుకు గుర్తించి ఆమెను మంగళవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించారు. ఆమెకు సేవ ఆరోగ్యమిత్ర ప్రశంసాపత్రంతో పాటు రూ.5వేలు రూపాయలు నగదు బహుమతిని అందజేశారు.ఇదే స్ఫూర్తితో పని చేసి ఆరోగ్యశ్రీ పథకానికి, నూతనంగా ఏర్పాటైన బాపట్ల జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆరోగ్యశ్రీ సిబ్బందికి సూచించారు.

ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-అద్దంకి : స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు మంగళవారం తెలుగు భాషా క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడుక భాషగా తెలుగు యొక్క ప్రాధాన్యతను, క్రీడా స్ఫూర్తిని నింపిన గిడుగు వెంకట రామమూర్తి, గోపిచంద్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం,కటకం శ్రీనివాసరావు,పేరెంట్స్ కమిటి చైర్మన్ పేరం సుధాకరరెడ్డి,ఉపాధ్యాయులు బండి శ్రీనివాసరావు,సుంకర శ్రీదేవి తదితరులు తెలుగు భాషా దినోత్సవం గురించి,జాతీయ క్రీడా దినోత్సవం గురించి ప్రసంగించారు.

తెలుగు భాషను ప్రజలే కాపాడుకోవాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో చీరాల విజిలి పేటలోని, కేపీపీ అప్పర్ ప్రయిమరీ హైస్కూల్లో తెలుగు భాష దినోత్సవం, గిడుగు రామ్మూర్తి 160 వ జయంతి నిర్వహించారు. గిడుగు స్ఫూర్తితో తెలుగు భాషను ప్రజలే కాపాడుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోటా వెంకటేశ్వర రెడ్డి అన్నారు.పాఠశాల హెచ్.ఎం కె.సుశీల మాట్లాడుతూ మన తెలుగు భాష మాతృభాషగా బాలబాలికలకు నేర్పించి మాతృ భాషపై నైపుణ్యము కలిగించాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ త్వరలో చీరాలలో జరుగుచున్న జనవిజ్ఞాన వేదిక మహాసభలలో మాతృభాషకు ప్రాధాన్యత పెంచుతూ ప్రభుత్వ ఉద్యోగ కల్పనకు ఇతర అంశాలను చర్చించనున్నామని అన్నారు.అనంతరం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసిన లార్ప్ స్వచ్ఛందసంస్థ డైరెక్టర్ కె.కళ్యాణి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోటా వెంకటేశ్వర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పక్కా గృహాల నిర్మాణంలో జిల్లా పురోగతి

- కలెక్టర్ రంజిత్ బాష

విశాలాంధ్ర - బాపట్ల : జగనన్న కాలనీలలోని పక్కాగృహాల నిర్మాణాలలో అధికారులు పురోగతి సాధించారని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.శివప్రసాద్ తెలిపారు. పక్కా గృహనిర్మాణాల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పక్కాగృహ నిర్మాణాలలో తొలిదశ లక్ష్యాలను అధికారులు అధిగ మించారని మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ చెప్పారు. బాపట్ల జిల్లాలో 31,109 పక్కాగృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆగష్టు 30వ తేదీ నాటికి 11 వేల గృహాలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా జిల్లా కలెక్టరు నాయకత్వంలో అధికారులు అధిగమించారని తెలిపారు.గృహనిర్మాణ శాఖ, విద్యుత్, ఆర్.డబ్ల్యు.ఎస్, డ్వామా,డి.ఆర్.డి.ఏ, మెప్మా తదితర శాఖల అధికారులంతా సమిష్టి కృషితో 11,871గృహాలు పూర్తయ్యేలా చిత్తశుద్ధితో పనిచేశారని ప్రశంసించారు. పునాది దశలోని గృహాల నిర్మాణం 50 శాతం పురోగతిలో ఉందన్నారు.జగనన్న కాలనీలలో మౌళిక సదుపాయల కల్పనకు అధికారులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం లక్ష్యాలు చేరుకోవడంలో ముమ్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని, అధికారుల నిర్లిప్తం ఉండరాదన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలనను సరించి అధికారులంతా పనిచేయాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. జిల్లాలో 6,267 గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు. అందులో 2,237 గృహాలలో వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రజలు నిర్మించుకోగా మిగిలినవి సత్వరమే పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఉపాధిహామి పథకం కింద ఆయా కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతి కాలనీలో గృహనిర్మాణాలకు అవసరమైన వనరులు సమ కూర్చాలని ఆయన సూచించారు. జగనన్న కాలనీలలోని పక్కాగృహ నిర్మాణాలకు యుద్ధప్రాతిపదికన ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా చెప్పారు. ప్రస్తుతం రూఫ్ దశలోని 2,899 గృహాలకు ఇంకుడుగుంతలు మంజూరు చేయగా వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయన్నారు. 1600ల ఇంకుడు గుంతలకు గ్రామపంచాయితీలో తీర్మానాలు, అనుమతులు తీసుకోవాలన్నారు. వీటిపై ఎమ్.పి.డి.ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. భూగర్భ జలాలు తక్కువగా ఉన్న కాలనీలన్నింటిలోను ఇంకుడుగుంతలు నిర్మించాలని కలెక్టరు తెలిపారు. ఉపాధిహామి పథకం అనుసంధానంగా ఈ పనులు చేపట్టాలన్నారు. 10,600 గృహాలు పునాదికి దిగువ స్థాయిలో ఉండడంపై ఆయన ఆరా తీశారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలోని జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న పక్కా గృహాల ఫోటోలను ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయాలని ఆయన ఆదేశించారు. వేటపాలెం మండలం కొణిజేటి నగర్-2లోని 273 గృహాల నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యిందని చెప్పారు. ఈనెల 30వ తేదీన ఆ కాలనీలోని గృహాలను ప్రారంభించనున్నట్లు కలెక్టరు తెలిపారు.లక్ష్యాలను మించి బాపట్ల జిల్లాలో పురోగతి సాధించడంపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ను రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.శివప్రసాద్ శాలువలు కప్పి, పుష్ప గుచ్ఛాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పి.డి ప్రసాద్, డ్వామా పి.డి వై.శంకర్ నాయక్, డి.ఆర్.డి.ఏ పి.డి బి.అర్జున్ రావు, అను బంధ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గిడుగు సేవలు స్మరించుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర -బాపట్ల : తెలుగు భాషా వికాసానికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన సేవలను స్మరించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. మంగళవారం గిడుగు వెంకట రామమూర్తి 160వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని స్పందన హల్‌లో కలెక్టర్ గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాంధిక భాషను వ్యవహారిక భాషగా మార్చడానికి కృషి చేసిన మహానుభావుడు గిడుగు రామమూర్తి అన్నారు. గ్రాంధిక భాషను వ్యవహారిక బాషా చేయడానికి ఉద్యమం నడిపారన్నారన్నారు. వ్యవహారిక బాషలో మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేస్తే విధంగా తెలుగును తయారు చేశారన్నారు. పాఠశాలలో పాఠ్యంశాలను వ్యవహారిక బాషగా తయారు చేయడానికి కవులు, రచయితలు వారధులుగా నిలిచారన్నారు. తెలుగు బాషా అభివృద్ధి కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులకు కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, నందనము శ్రీనివాసరావు, మన్నే శ్రీనివాసరావు, దివి శ్రీరామ్ మూర్తి, రావూరి నరసింహారావు వర్మ, పోలాసం వీరాజనేయులు, కె.రాజేశ్వరి, జొన్నలగడ్డ సాధు హెర్బిట్, బి.ఎస్.నారాయణ భట్టు, నందిరాజు విజయ్ కుమార్,పరిమి సుబ్రమణ్య చారి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాపట్ల ఆర్డిఓ గంధం రవీంద్ర అన్నారు. మంగళవారం పిట్టలవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా బాపట్ల ఆర్డిఓ గంధం రవీంద్ర పాల్గొని తెలుగు భాష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రపంచ భాషల్లోనే తెలుగుభాష ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. తెలుగు భాష పరిరక్షణకు అందరూ నడుంబిగించాలన్నారు.తెలుగు భాష కనుమరుగైతే మన సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు అవుతాయని, తెలుగు భాష గొప్పదనం, ఔన్నత్యాన్ని, విశిష్టతను రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ కవిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై అభ్యంతరాలు తెలిపాలి

విశాలాంధ్ర - వేమూరు : ఓటరు జాబితా సవరణలపై అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటిని తెలియజేయాలని వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి జల్లి మోహనరావు తెలియజేశారు.మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు తహసీల్దార్లు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా జరుగుతున్న తీరుపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తొలగింపు ఓట్లపై పునః పరిశీలన చూస్తున్నామన్నారు.ఆ తర్వాత కూడా అభ్యంతరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్లో మార్పు విషయాల్లో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అఖిలపక్ష నాయకులకు తెలియజేశారు. సమావేశంలో ఐదు మండలాలు తహసీల్దార్లు పార్టీల నాయకులు ఉన్నారు.

తెలుగు భాషా ఉద్యమ పితామహుడు 'గిడుగు'

విశాలాంధ్ర-పర్చూరు: తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని ఇడుపుల పాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు ఉపాధ్యాయుడు బండారు అనిల్‌కుమార్ మాట్లాడుతూ వ్యవహారిక భాషా ఉద్యమానికి మూలపురుషుడు, బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పెంట్యాల పావని, భవనం శివలీల, అంబటి సురేష్, వసంత రఘుబాబు, నాగార్జున, శ్రీవిద్య లక్ష్మీ, రాధిక, ఆదినారాయణ ఉన్నారు.

ఇసుక దోపిడీని అరికట్టాలి

విశాలాంధ్ర-అద్దంకి : వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దోపిడీని అరికట్టాలని మండల తెదేపా నాయకులు అధికారులను కోరారు. వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దోపిడిపై నిరసన కార్య క్రమంలో భాగంగా రెండవరోజు మంగళవారం తెదేపా నాయకులు తహశీల్దార్ జివి.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యంగా స్థానిక వైకాపా నేతలు మోదేపల్లి, మణికేశ్వరం,తమ్మవరం, రామాయపాలెం, తిమ్మాయపాలెం వద్ద ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేకున్నా ఇష్టారీతిన ఇసుక దందా చేస్తూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఆర్జిస్తున్నారని ఆరోపించారు. జెప్ వెంచర్స్‌తో ఒప్పందం ముగిసినా ,జివిస్టీ నెంబర్ సస్పెండ్ అయినా అదే కంపెనీ పేరుతో ఇసుక తవ్వకాలు ఎలా జరుగుతున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నాలుగేళ్ళలో 40 కోట్ల టన్నుల ఇసుకతవ్వి 40 కోట్లు దోచేసిన ఇసుకా సురుడుగా మారిన సీఎం జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు.ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఈప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు అన్ని వర్గాల ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని నేతలు తెలిపారు.

చిన్నారుల వివరాలన్నీ పక్కగా నమోదు చేయాలి

- కలెక్టర్ రంజిత్ భాష

విశాలాంధ్ర - బాపట్ల : చిన్నారుల వివరాలన్ని అధికారులు స్టూడెంట్ ఇన్ఫోలో పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు.గ్రోత్ ఎన్రోల్ మెంట్ రేషియోపై ఎంపీడీవోలు,విద్యాశాఖ అధికారులతో మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ప్రతి పిల్లవాడు బాలికలు పాఠశాలల్లో కళాశాలలో చేరి ఉండాలని కలెక్టర్ చెప్పారు. ఐదు నుంచి 18 సంవత్సరాల వయసు లోపు 2,03,156మంది చిన్నారులు బాపట్ల జిల్లాలో ఉన్నట్లు కణాంకాలు ఉండగా గ్రామాలలో వాలంటీర్ల ద్వారా సర్వే చేయగా 2,00,076 మంది చిన్నారులు జిల్లాకు చెందినవారుగా ఉన్నారని వివరించారు.ప్రస్తుతం జిల్లాలో 99,926 మంది నివాసముంటుండగా సమగ్రసర్వే ద్వారా 94,999 మందిని గుర్తించి వారి వివరాలను స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేశారని తెలిపారు.మిగిలిపోయిన 4,927 మంది వివరాలను తక్షణమే సర్వే ద్వారా గుర్తించి ఆన్లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు.గడిచిన విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన 15,183మంది విద్యార్థులు ఇంటర్మీడియట్,పాలిటెక్నిక్, ఐటిఐ వంటి వివిధ కోర్సులలో చేరారని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు.పదో తరగతి తప్పిన 3,500 మంది విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించామన్నారు.జిల్లాలో ఉన్న 8,480 మంది వాలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలలో సర్వే నిర్వహించారని వివరించారు.18 సంవత్సరాలలోపు చిన్నారులు ఎక్కడ ఉన్నారు,ఏం చేస్తున్నారు,మృతులు,వలస,శాశ్వత వలసలు వెళ్లిన వారి వివరాలను సైతం స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్ లో నమోదు చేయాలన్నారు.ఇతర జిల్లాలలు, పొరుగు రాష్ట్రాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలను కూడా ఇందులో పొందుపరచాలన్నారు. చిన్నారులపై నిర్వహిస్తున్న సర్వే పక్కాగా ఉండాలని,సెప్టెంబర్ ఎనిమిదో తేదీలోగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.నిజాంపట్నం మండలంలో 8,516మంది చిన్నారులు ఉండగా వారి పూర్తి వివరాలను నూరు శాతం నిక్షిప్తం చేశారన్నారు. నూరు శాతం సర్వే పూర్తయిన మండలాలలో కారంచేడు, జె.పంగులూరు, అద్దంకి, అమర్తలూరు మండలాలు ఉండడంపై కలెక్టర్ అభినందించారు. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఆయా మండలాలలో మిగిలిపోయిన వారి వివరాలపై మండలాల వారీగా ఆయన సమీక్షించారు.పిట్టలవానివారిపాలెం మండలంలో సర్వేలో 4,915మంది మిగిలి పోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. అక్కడ 45 శాతం నమోదుపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ఎస్పీ కార్యాలయంలో గిడుగు జయంతి

విశాలాంధ్ర -బాపట్ల : జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ ఎమ్.డి.హెచ్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గిడుగు చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.తెలుగు భాష కఠినమైన గ్రాంథిక రూపంలో ఉండేదని, అర్థం చేసుకోవడం చాలా కష్టంగా ఉండేదని, అప్పట్లో ఉపాధ్యాయుడిగా ఉన్న తెలుగు భాషా శాస్త్రవేత్త గిడుగు రామమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్.ఐ మన్మధ రావు, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీకాంత్ నాయక్, డి.పి. ఓ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల కీర్తిని పెంచిన అద్దంకి పద్యశాసనం

విశాలాంధ్ర -బాపట్ల : అద్దంకి పద్య శాసనం బాపట్ల జిల్లా కీర్తికి ధ్రువతారగా వెలుగొందుతుందని తెలుగు పద్యం బాపట్ల జిల్లాలోనే పురుడు పోసుకోవడం జిల్లా వాసులందరికీ గర్వకారణమని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా అన్నారు. ఫోరంఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో నెల కొల్పిన అద్దంకి పద్య శాసన ప్రతికృతిని కలెక్టర్ తెలుగు బాషాదినోత్సవం సందర్భంగా మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుకు కావ్య భాష హోదా కల్పించిన అద్దంకి పద్య శాసనం చారిత్రాత్మకమైనదని తెలుగు భాషాసాహిత్య ప్రాచీనతకు అద్దం పడుతుందన్నారు. తెలుగు పద్య మహాసౌధానికి పునాదిరాళ్లు మోసిన వాళ్ళు జిల్లా వాసులు కావడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె. లక్ష్మి శివజ్యోతి, ఫోరంకార్యదర్శి డాక్టర్. పి సి సాయిబాబు, చిత్రకారుడు జీవి సాహితీవేత్తలు,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - చీరాల : జాతీయ క్రీడాదినోత్సవం,తెలుగు భాషా దినోత్స వాలని పురస్కరించుకుని పేరాల ఆంధ్రరత్న పురపాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు,హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు చేసిన సేవలని కొనియాడారు.వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు బి.సాల్మన్‌రాజు, ఉపాధ్యాయులు, రమణరావు, సుందర రామిరెడ్డి, చంద్ర శేఖర్, శివవరప్రసాద్,రాజేంద్రప్రసాద్ గాంధీ, భానుచంద్ర పాల్గొన్నారు.

దేశసేవ చేశాను..ప్రజా సేవ చేస్తాను

విశాలాంధ్ర - చీరాల : మిలటరీలో 28 సంవత్సరాలు దేశంకోసం సేవ చేశానని,అదే స్ఫూర్తితో వేటపాలెం రోటరీ క్లబ్బులో సభ్యులుగా చేరి ప్రజా సేవలో భాగమయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ సుబేదార్ గౌరబత్తుని బాబురావు అన్నారు.అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జాండ్రపేట శివాలయంలో మంగళవారం 60 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబురావును దుశ్శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఏవి.సురేష్‌బాబు, గుత్తి, పరంజ్యోతి, సీతా రామయ్య, మణికంఠ, పద్మాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దందా, అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి ఇంఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు బాపట్ల మండల తహశీల్దార్, రూరల్ పోలీసు స్టేషన్ అధికారికి టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పార్టీ నాయకులు బరితెగించి ఇసుక అక్రమ దందా చేస్తూ కోట్లు గడిస్తున్నారన్నారు.బాపట్ల ప్రజలకు మంచి చేస్తారని నమ్మి గెలిపించిన ఎమ్మెల్యే కోన రఘుపతి అవినీతి మత్తులో సంపాదనే ధ్యేయంగా ఇసుక అక్రమ త్రవ్వకాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల పేరిట వాగులు,వంకలు నుండి ఇసుక త్రవ్వి, రీచ్‌లలో త్రవ్వకాలు మొదలు స్టాక్ పాయింట్లలో విక్రయాలు,తూకం వంటి వాటిలో భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్న సరే వైసీపీ నాయకులు భాగస్వామ్యం ఉండటం వల్ల అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. సోమవారం నరేంద్రవర్మ ఆధ్వర్యంలో కొత్తపాలెం గ్రామంలో వెదుళ్లపల్లి కో ఆపరేటివ్ సొసైటీ స్థలంలో ఇసుక అక్రమ త్రవ్వకాలు జరుగుతున్నాయని తవ్వకాల వద్దకు వెళితే ప్రొక్లైనెర్‌లను తరలించారన్నారు. చుట్టూ ప్రక్కల రైతులు జీవనోపాధి కోసం ఆకుకూరలు, కాయగూరలు పండించుకొంటారని సొసైటీ వారు స్థలాలు ఇస్తే వైసీపీ నాయకులు వారిని బెదిరించి ఆ స్థలాలలో అక్రమంగా నిబంధనలు తుంగలో త్రొక్కి 30 అడుగుల కంటే ఎక్కువ లోతుగా త్రవ్వుతూ ఇసుక దోపిడీ చేస్తున్నారన్నారు.త్రవ్వకాల వలన పర్యావరణనికి తీవ్ర నష్టం జరుగుతూ భూగర్భ జలాలు ఇంకిపోయి రైతులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం టన్ను ఇసుక 475 అని భారీగా ప్రకటనలు ఇచ్చి ప్రచారం చేసుకొంటున్న వాస్తవానికి వచ్చే సరికి అమలు కావడం లేదన్నారు.జే పీ వెంచర్స్‌కి ఇచ్చిన కాంట్రాక్టు గడువు ముగిసిన అదే జీఎస్టీ బిల్లుతో దొంగ వే బిల్లులు సృష్టించి అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. ఆన్‌లైన్ బిల్లులు ఇవ్వాలని నిబంధనలు ఉన్న సరే వాటి కంటే ఉత్తుత్తి బిల్లులు ఇస్తున్న పట్టించుకోనేవారే లేరన్నారు. బాపట్లలో జరుగుతున్న ఇసుక అక్రమ త్రవ్వకాల మీద, ఇసుక మాఫియా మీద వెంటనే చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపాల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ముక్కమల సాంబశివరావు, కావూరి శ్రీనివాసరెడ్డి, ఇనగంటి గాంధీ, గుడిపల్లి సాంబశివరావు, ఫారిద్ మస్తాన్, మీరా వల్లి, కొల్లూరి వెంకట్రావు, మరీదు వెంకటేశ్వరరావు, అంద్రెయ్య, పరిసా రమేష్,చెన్నుపాటి కిషోర్,జెట్టి దినేష్, హనుమాన్, యాలమంద, ఆదే వంశీ, షాలేంరాజు, ఉమ్మారెడ్డి వెంకటేష్, దురా ప్రసాద్, సోములు, సలగల రాజా, చార్లెస్, పసుపులేటి శివ, పల్నాటి శ్రీను,తాహేర్, బొడ్డు గోవింద్, యోబు, అమరేశ్, తాత చినబాబు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - చీరాల : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అసాంఘిక కార్యకలాపాల కట్టడికి నిరంతర నిఘా ఉంచామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. వార్షిక తనిఖీలలో భాగంగా చీరాల సబ్ డివిజన్ పరిధిలోని మంగళవారం కారంచేడు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని కారంచేడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేయడం జరిగిందని స్టేషన్ పరిధిలో జరిగే నేరాలు,వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై,ఎస్‌హెచ్ఓ,సిబ్బంది,గ్రామ సచివాలయ మహిళా పోలీసుల పనితీరును గురించి సమీక్షించామన్నారు.పోలీస్ సిబ్బంది,సచివాలయ మహిళా పోలీసులకు ఉన్న శాఖపరమైన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నామని,స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రదేశాల గురించి,ఆ ప్రదేశాలలో తీసుకోవలసిన చర్యల గురించి సమీక్ష జరిపామన్నారు.ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని,మహిళలపై,మైనర్ బాలికలపై ఎవరైనా నేరాలకు పాల్పడిన,చట్టం నుండి తప్పించుకోకుండా తగిన శిక్షలు పడేలా కోర్టు ట్రయిల్ మానిటరింగ్ నిర్వహిస్తున్నామని, ఎన్నడూలేనివిధంగా కోర్టులలో ముద్దాయిలకు జైలు శిక్షలు విధించబడుతున్నా యన్నారు.అనంతరం కారంచేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ సచివాలయ మహిళ పోలీసులు, పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై, వారు చేస్తున్న విధుల గురించి,పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాల గురించి,రౌడీలు, అనుమా నితులు,పాత నేరస్తుల వివరాలు,వారి ప్రస్తుత జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఉన్న స్థల వివాదాలు,కుటుంబ తగాదాలు, వర్గ విభేదాలు సమాచారం అడిగి గ్రామ సచివాలయ మహిళా పోలీసులు అంకితభావం, సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తూ ఆ గ్రామానికి సంబంధించిన సమాచారంను ఎప్పటికప్పుడు సేకరించి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓకు అందజేయాలని సూచించారు. కుటుంబ తగాదాలు ఆస్తి వివాదాలు వంటి వాటిని తొలిదశలోనే గుర్తించి తగిన ముందస్తు చర్యలు తీసుకుంటే తీవ్రమైన నేరాలుగా పరిణమించకుండా నియంత్రించవచ్చని, ఏవైనా అవాంఛనీయ ఘటనలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలు జరిగే అవకాశం వుంటే వెంటనే సంబంధిత సమాచారం స్టేషన్ ఎస్ఐకి తెలియపరచాలని,పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది వారి దత్తత గ్రామాన్ని వారానికి ఒకసారి కచ్చితంగా సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.పోలీస్ స్టేషన్ లో నిర్వహించే వివిధ క్రైమ్ రికార్డులను,సిడి ఫైల్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించి,కేసు యొక్క పురోగతిని ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్‌లో నమోదు చేస్తున్నారో లేదో అని స్వయంగా సిసిటిఎన్ఎస్‌లో సరిపోల్చుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని,వృత్తి నైపుణ్యాన్ని ఉపయోగించి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని,బీట్ వ్యవస్థను మరింత పటిష్టం చెయ్యాలని, ప్రత్యేకంగా రూపొందించిన ఈ బీట్స్ యాప్ ను ఉపయోగించి రాత్రి సమయాలలో గస్తీ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పి ఎస్ ప్రసాదరావు, ఇంకొల్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి సూర్యనారాయణ,జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఏశ్రీనివాస్ పాల్గొన్నారు.